క్లుప్తంగా

చర్చి నిర్మాణానికి విరాళాలు



దాతలను సన్మానించిన చర్చి సంఘ పెద్దలు

గోనెగండ్ల : మండలంలోని పెద్దనేలటూర్ గ్రామంలో నిర్మించిన చర్చి నిర్మాణానికి పలువురు దాతలు కులమతాలకు అతీతంగా ముందుకు వచ్చారు. ఇందులో భాగంగానే చర్చిలో పులిపీఠం ఏర్పాటుకు ఆ గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ చంద్ర, ఎస్ఐ మాల చంద్రశేఖర్, టీచర్ మాల రంగన్న, మాల ఓబులేష్, డాక్టర్ మాల మునిస్వామి, జీజీహెచ్ మాజీ హెచ్‌డీసీ సభ్యుడు డీఎంఎస్ జహంగీర్ రూ.1.80 లక్షలు చర్చి సంఘ పెద్దలకు అందజేశారు. దీంతో దాతల సహకారంతో పులిపీఠం నిర్మించారు. సోమవారం పులిపీఠం నిర్మాణానికి సహకరించిన దాతలను చర్చి సంఘ పెద్దలు శాలువాల, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

విద్య కాషాయీకరణకు కుట్ర



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

ఎమ్మిగనూరుటౌన్: విద్యతో పాటు పాఠశాలలను కాషాయీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ ఆరోపించారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ 48వ ప్లీనరీ ముంగింపు సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ మూడో సారి ప్రధాని అయిన నరేంద్రమోదీ ప్రభుత్వ విద్యను పూర్తి స్థాయిలో కార్పొరేట్ చేయడానికి యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యను కషాయీకరణ చేసేందుకే జాతీయ నూతన విద్యా విధానం తీసుకొచ్చారని విమర్శించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ నాయకులు ఆనంద్‌బాబు, నూతన జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్, కార్యదర్శి రంగప్ప, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, విజయ్, అమర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

బుక్ కీపర్‌ను కొనసాగించాలి

ఆదోని రూరల్: మండలంలోని గణేకల్ గ్రామంలో గత 18 సంవత్సరాలుగా పని చేస్తున్న నాగవేణినే బుక్ కీపర్‌గా కొనసాగించాలని సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట గణేకల్ గ్రామ పొదుపు మహిళలు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు, మండల కార్యదర్శి లింగన్న, వీరారెడ్డి తదితరులు మద్దతు తెలిపారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నిజాయితీగా పనిచేస్తున్న బుక్ కీపర్ నాగవేణిను తొలగించొద్దని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారిణి వసుంధరకు వినతి పత్రం అందించారు.

వరద కాలువ నిర్మించండి

కౌతాళం: తుంగభద్ర నదికి వరద కాలువ నిర్మించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య అన్నారు. సోమవారం తుంగభద్ర నదిని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా రావడంతో జూలై నెలలోనే తుంగభద్ర డ్యాం నిండి గేట్లు ఎత్తడం జరిగిందని, డ్యాం నుంచి 90వేల క్యూసెక్కుల నీరు నదికి వదిలారన్నారు. ఈ వరద నీరంత సముద్రం పాలవుతున్నాయని ఆ నీటిని మనము వరద కాలువ నిర్మించుకుని ఉపయోగించుకుంటే ఈ ప్రాంతం అంతా సస్యశ్యామలమవుతుందన్నారు. వీరి వెంట మండల కార్యదర్శి ఈరన్న, నాయకులు వలి, ఉలిగయ్య పాల్గొన్నారు.

నూతన బైకు ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



నూతన బైకుపై కూర్చొని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండు- విద్యుత్ డివిజన్ కార్యాలయం మధ్య నూతనంగా ఏర్పాటు చేసిన బైకు షోరూంలో సోమవారం ఓలారోడ్ స్టార్ బైకును మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. మల్లికార్జున అనే వ్యక్తి బైకును కొనుగోలు చేయగా మాజీ ఎమ్మెల్యే బైకును నడుపుతూ కొంతదూరం వెళ్లారు.

నదీ తీరంలో అధికారుల పర్యవేక్షణ

మంత్రాలయం : తుంగభద్ర డ్యాంకు వరద నీరు పోటెత్తడంతో దిగువకు వరద నీరు విడుదల చేశారు. సోమవారం 29 గేట్లు ఎత్తి 1.29 లక్షల క్యూసెక్కుల నీరు వదిలారు. దీంతో తుంగభద్ర నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ రమాదేవి, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ నదీ తీరంలో పర్యటించారు. భక్తులను మైకుల ద్వారా ఎప్పటి కప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.
కౌతాళం : తుంగభద్ర తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నదితీర గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.
కోసిగి: కందుకూరు సమీపంలోని రాజోలి బండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) వద్ద తుంగభద్ర నది ప్రవాహాన్ని తహసీల్దార్ వేణుగోపాల్, ఇరిగేషన్ ఏఈఈ రవి ప్రసాద్ పరిశీలించారు.

సహనానికి పరీక్ష!

- ఉరుకుందలో శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం
- కోసిగి మీదుగా క్షేత్రానికి వాహనాల రద్దీ
- నిత్యం ట్రాఫిక్ జాంతో భక్తుల అవస్థలు
- రైల్వే గేటు పడితే ప్రయాణికులకు నరకమే
- ఇరుకు రోడ్లతో ఇబ్బందులు



కోసిగి రైల్వే గేటు వద్ద రద్దీగా ఉన్న వాహనాలు

కోసిగి: శ్రావణ మాసం ప్రారంభమైంది. జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం నెలరోజుల పాటు భక్తులు తండోపతండాలు తరలి వెళ్లి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అయితే కోసిగి మీదుగా ఉరుకుంద వెళ్లే రహదారిలో తరచూ రైల్వే గేటు పడుతుండటం, రోడ్డు ఇరుకుగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ జాం అవుతోంది. దీంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. శ్రావణ మాస ఉత్సవాలు ముగిసేంత వరకు భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా కోసిగి రైల్వే గేటు, జుమ్మాలదిన్నె గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

కోసిగి నుంచి ఉరుకుందకు సింగిల్ రోడ్డే దిక్కు

కోసిగిలో ఉరుకుంద ఆర్చ్ నుంచి జుమ్మాలదిన్నె గ్రామం మీదుగా ఉరుకంద గ్రామానికి 10 కిలో మీటర్లు దూరం ఉంది. 10 కిలో మీటర్లు సింగిల్ రోడ్డు ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఎదురెదురుగా బస్సు వస్తే రోడ్డు కిందకు దిగేందుకు వీలు లేకుండా ఉంది. అదమరిస్తే బస్సు రోడ్డు కిందకు పడి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో గతంలో ఒక సారి బస్సు కిందకు పడిపోగా, మరికొన్ని వాహనాలు ఎదురెదురుగా ఢీకొని గాయాలైన సంఘటనలు చాలానే ఉన్నాయి. అలాగే జుమ్మాలదిన్నె గ్రామంలో ఇళ్ల మధ్యలో ఇరుకైన రోడ్లలో వాహనాలు వెళ్తుండడంతో వాహనాలు ఇరుక్కుపోయి తీవ్ర మైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఒక సారి ట్రాఫిక్‌లో వాహనాలు ఇరుక్కుపోతే గంటలు తరుబడి రోడ్లపై వాహనాలు నిలిచి పోతున్నాయి. ఈ విషయంపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కోసిగి రైల్వే గేటు ఓ పెద్ద సమస్య

మండల కేంద్రం కోసిగిలో రైల్వే గేటు పడితే చాలు వాహనాలు ఎక్కడిక్కడే నిలిచి పోతాయి. రైలు వచ్చి, వెళ్లిపోయి గేటు తెరిచే సరికి 20 నిమిషాలకు పైగా సమయం పడుతుంది. గేటు తెరిచిన వెంటనే వాహనాలు ఎదురెదురుగా వెళ్తుండటంతో ట్రాఫిక్ జాం అవుతోంది. ఈ వాహనాలన్నీ వెళ్లే లోపే మరో రైలు రాక కోసం గేటు పడుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చైన్నె-ముంబాయి ప్రధాన రైల్వే మార్గం కావడంతో ప్యాసింజర్ రైళ్లతో పాటు గూడ్స్ రైళ్లు రోజు వారీగా 80 నుంచి 100 వరకు రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈతరుణంలో ఉరుకుందకు వెళ్లే భక్తులు రైల్వే గేటు ఒక ప్రధాన సమస్యగా మారుతోంది.

● వాహనాల రద్దీ

మండల కేంద్రం కోసిగి నుంచి జుమ్మాలదిన్నె మీదుగా వెళ్తే 10 కిలో మీటర్లు దూరంలో ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రం ఉంది. కోసిగి మీదుగా కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాక కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా, తెలంగాణ ప్రాంతంలోని మహబూబ్ నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల నుంచి భక్తులు వేలాది వాహనాలలో భక్తులు తరలి వెళ్తుంటారు.



జుమ్మాలదిన్నె గ్రామ వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వాహనాలు



భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



కోసిగి మీదుగా ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం నెల రోజుల పాటు భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. ప్రతి ఏటా వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేగేటు, జుమ్మాలదిన్నె గ్రామంలో దాదాపు కిలో మీటర్ మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.
– రాముడు, ప్రజా సంఘాల నాయకుడు, కోసిగి

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటాం

ఉరుకుంద ఈరన్న స్వామి ఉత్సవాలు ముగిసేంత వరకు భక్తులు ట్రాఫిక్‌లో ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ప్రధాన కూడలి, రైల్వేగేటు, ఉరుకుంద ఆర్చ్, జుమ్మాలదిన్నె గ్రామంలో పోలీసులను నియమించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తాం. జుమ్మాలదిన్నె గ్రామం మీదుగా సింగిల్ రోడ్డు ఉండడంతో భక్తుల వాహనాల రద్దీని బట్టి వాహనాల ఇతర ప్రాంతాల నుంచి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– మంజునాథ్, సీఐ. కోసిగి

ఎంఈఓ-1గా గోవిందు



నందవరం : మండల విద్యాధికారి-1గా డి. గోవిందు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈఓ-1గా ఎఫ్ఏసీగా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తుండగా ఉన్నాతాధికారులు ఎంఈఓ బాధ్యాతలు అప్పగించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం రూరల్ : ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శివాంజల్ అన్నారు. సోమవారం మండల కేంద్రం మంత్రాలయంలోని రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ఈవ్‌టీజింగ్ ర్యాగింగ్, సైబర్ నేరాలు, మహిళలు, బాలికలు రక్షణ, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాల నివారణ అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో కరస్పాడెంట్ సుబ్బరాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' అమలు చేయాలి

నందవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, మండల కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1 ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు, రైతులు కౌలుకార్డులు మంజూరు చేయాలని, అన్నదాత సుఖీభవ కింద నగదు జమ చేయాలని కొరుతూ ధర్నా చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులుకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ముని, ఈరన్న, నరసింహులు, చెన్నప్ప, ఆంజనేయ, రామలింగడు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే, ఆదోని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సాయిప్రసాద్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులు, మహిళలకు పిలుపునిచ్చారు. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఆదోని మున్సిపల్ చైర్మన్ పీఠం వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సాయిప్రసాద్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వైఎస్సార్‌టీయూసీ జాయింట్ సెక్రటరీగా వి.కె.జైపాల్‌ను ఎన్నిక చేసిన సందర్భంగా సాయి ప్రసాద్‌రెడ్డిని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఆదోని సాయన్న, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్రస్థాయిలో పదవిని కట్టబెట్టిన జగనన్న, సాయన్నకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ చలపతి, పట్టణాధ్యక్షుడు దేవా తదితరులు పాల్గొన్నారు.

మసీదుపురంలో పోటెత్తిన భక్తులు





పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి, పెద్దహరివాణం నవనాగ గణపతిస్వామి



స్వామి వారికి నైవేద్యం సిద్ధం చేస్తున్న భక్తులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదపురం గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రావణ మాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు పోటెత్తారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో ఈ దేవాలయంలో నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్వామిని దర్శించుకోవడానికి మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లిస్తారు. నెల రోజుల పాటు గ్రామంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు జరుగుతాయి.

ఘనంగా నాగుల చవితి

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో వెలిసిన శ్రీ నవనాగ గణపతిస్వామి సన్నిధిలో సోమవారం విద్యావాచస్పతి డాక్టర్ గరుడాద్రి దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలో నాగుల చవితి వేడుకలను నిర్వహించారు. భారతదేశంలోనే ఏకైక నవనాగ దేవాలయంగా ప్రసిద్ధి చెందిన ఈ దేవాలయంలో 9 నాగులు ఒకే బంధంగా ఉన్న రూపము ప్రత్యేకంగా భక్తులను ఆకర్షిస్తోంది. జ్యోతిష్యశాస్త్ర రీత్యా ఉండే తొమ్మిది రకాల నాగదోషాలకు పరిహారం ఇక్కడ చేస్తారు. నాగుల చవితి సందర్భంగా స్వామివారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, ఆవరణ పూజ చేసి, హోమం నిర్వహించారు. వివాహ, సంతాన విషయాల్లో త్వరితగతిన ఫలితం కోసం చర్మవ్యాధి నివారణ కోసం భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు.

మంత్రాలయం రూరల్ : నాగుల చవితి సందర్భంగా సోమవారం ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లలో పిండివంటలు చేసుకుని నాగుల కట్టలకు ప్రత్యేక పూజలు చేసుకున్నారు. నూతన వధూవరులు నాగులకు పాలు పోశారు.

ఎమ్మార్పీఎస్ కమిటీల నియామకం

ఆదోని రూరల్: పట్టణంలోని శంకర్‌నగర్, కల్లుబావి, బంజరాపోల్ కాలనీల్లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో కల్లుబావి అధ్యక్షుడిగా కె.రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రంగస్వామి తదితరులను ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు టి.ఈరన్న మాట్లాడుతూ దళితుల హక్కుల సాధనకై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.



● ఉగ్ర'తుంగ'

నాగలదిన్నె బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నది

నందవరం : కర్ణాటకలోని ఎగువ శివమొగ్గ, తీర్థనహళ్లి, ఆగుంబే, బళ్లారి, వరినాడు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. సోమవారం టీబీ డ్యామ్ 27 గేట్లు ఎత్తి దిగువకు 1,15,759 క్యూసెక్కులు నీటిని వదలడంతో తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో బ్రిడ్జి వద్ద తుంగభద్ర నది వరద నీరు ప్రవాహం పెరిగింది. నదికి వరద నీరు రావడంతో తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది గట్టున రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను ఒడ్డుకు తెచ్చుకోవాలని రెవెన్యూ అధికారులు సూచించారు. నది తీర ప్రాంతాలైన నదికైరవాడి, గంగవరం, జోహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు హెచ్చరించారు.

హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయండి





5వ వార్డులో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ నాయకులు, కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

- అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీలు అమలు చేయని కూటమి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక
- ఎమ్మిగనూరులో 'చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

ఎమ్మిగనూరుటౌన్: ఓట్ల కోసం మభ్యపెట్టేందుకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాదైన అమలు చేయని కూటమి ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబును, టీడీపీ నాయకులను నిలదీయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో 5, 6 వార్డుల్లో శివన్న నగర్ ప్రాంతంలో వార్డు కౌన్సిలర్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన చంద్రబాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని క్యూఆర్ కోడ్ గురించి పార్టీ నాయకులతో కలిసి మహిళలకు వివరించారు.

హామీలు వెంటనే అమలు చేసిన జగనన్న

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగనన్న తాను ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారని బుట్టా రేణుక గుర్తు చేశారు. నాడు కోవిడ్‌తో రాష్ట్ర ఆదాయం పూర్తిగా దిగజారినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న సంకల్పంతో అన్ని సంక్షేమ పథకాలకు సంబంధించిన సొమ్మును పేదల బ్యాంక్ ఖాతాలకు జమ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అయితే ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాదైనా ఒక పింఛన్ల సంఖ్యలో భారీగా కోత పెట్టి పెంచడంతో పాటు, అరకొర తల్లికి వందనం పథకాన్ని మాత్రమే అమలు చేసి చేతులు దులుపుకుందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రకటనలు చేస్తూ దాన్ని మళ్లీ దాటవేతే పనిగా పెట్టుకుందన్నారు. ఇచ్చిన పథకాల గురించి ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించేలా ప్రభుత్వం తయారైందని విమర్శించారు.

'నేతన్న నేస్తాన్ని' తుంగలో తొక్కారు

మాజీ సీఎం జగనన్న నేతన్న నేస్తం కింద మగ్గం వున్న ప్రతి చేనేతకు ఏడాదికి రూ.24వేలు ఇచ్చారని ఇప్పుడు ఈ ప్రభుత్వం దాన్ని తుంగలో తొక్కిందన్నారు. నేతన్నలకు కూటమి ప్రభుత్వం ఇస్తామని చెప్పుకొన్న 200ల యూనిట్ల ఉచిత విద్యుత్ నేటికీ అమలు చేయలేదని చెప్పారు. నాడు జగనన్న అమలు చేసిన 100 యునిట్ల ఉచిత విద్యుత్‌నే నేటికి కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు బోయబజారి, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, నియోజకవర్గ అధ్యక్షుడు మీసాల నీలకంఠ, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, బజారిరెడ్డి, ఇబ్రహీం, పాలశ్రీనివాసరెడ్డి, ముస్లిం మైనారిటీ విభాగం పట్టణ అధ్యక్ష ,కార్యదర్శులు ముల్లా రసూల్, అల్తాఫ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదివారాలు వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలి

ఆదోని రూరల్: పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్లలో ఆదివారాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ కోరారు. సోమవారం ఆదోనిలో డిప్యూటీ డీఎంహెచ్ఓ రఘునాథ్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ఆదివారం అర్బన్‌హెల్త్ సెంటర్లకు వచ్చే రోగులు, ప్రజలకు వైద్యులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఒక డాక్టర్‌ను, ఇద్దరు వైద్యసిబ్బంది నైనా ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రజా సమస్యలు వేగవంతంగా పరిష్కరించండి



ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల వేగవంతంగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం -పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారి వసుంధర, డీఎల్పీఓ తిమ్మక్క, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఆదోని నుంచి పర్వతాపురం ఏరియా వరకు రోడ్డు సరిగాలేదని, రోడ్డుకు మరమ్మతు పనులు చేయాలని డీవైఎఫ్ఐ టౌన్ కమిటీ నాయకులు వెంకటేష్, మోహన్ అర్జీ సమర్పించారు.

పెద్దకడబూరు : ఎమ్మిగనూరు నుంచి పెద్దకడబూరు మండలం కంబలదిన్ని వరకు రోడ్డును వేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, కృష్ణ వినతిపత్రం సమర్పించారు.

కళాశాల ఆవరణలోనే హాస్టల్ ఏర్పాటు చేయాలి

ఆదోని రూరల్: పట్టణంలో ఉన్న గర్ల్స్ కళాశాల ఆవరణలోనే వసతిగృహం ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధణాపురం ఉదయ్, వినోద్, విద్యార్థినులు శ్యామల, అరుణ, మానస డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కళాశాల నుంచి హాస్టల్‌కు వెళ్లాలంటే రానుపోనూ రెండు కి.మీ. దూరం అవుతుందన్నారు. దీంతో కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ నాయకులు చిన్న దానియల్, నరసింహులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల జారీలో జాప్యం తగదు

ఆదోని రూరల్: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంలో జాప్యం తగదని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బసాపురం గోపాల్ అన్నారు. సోమవారం మండలంలోని 104బసాపురం గ్రామంలోని సచివాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులతో పాటు కౌలురైతులకు అన్ని సంక్షేమ పథకాలను అందిస్తామని సీఎం చంద్రబాబునాయుడు చెప్పారన్నారు. కానీ అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచినా నేటికీ సక్రమంగా కౌలురైతులకు కౌలు గుర్తింపుకార్డులు ఇవ్వడం లేదన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పెద్దకడబూరు : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని తారాపురం, నౌలేకల్లు, మేకడోణ, పెద్దకడబూరు తదితర గ్రామాలలో సచివాలయాల ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సిబ్బందికి వినతిపత్రాలు సమర్పించారు. నాయకులు దస్తగిరి, రమేష్, మహాదేవప్ప పాల్గొన్నారు.

సంక్షిప్తం

రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలి

ఆదోనిరూరల్: సచివాలయాలకు రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలని సీపీఎం ఆదోని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణకు సోమవారం వినతి పత్రం అందించారు. సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, ముక్కన్న, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు వెంకటేష్ మాట్లాడుతూ సచివాలయాలు ఇన్‌చార్జ్‌లతో కొనసాగుతున్నాయన్నారు. దీంతో ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లు సక్రమంగా అందడం లేదన్నారు.

యూరియా కొరత లేకుండా చూడండి

కోసిగి: మండలంలోని రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులకు తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి బ్యాంక్ రుణాలు, ఎరువులు అందజేయాలన్నారు. ఇందులో రైతు సంఘం మండల అధ్యక్షుడు తాయన్న, ఏఐటీయూసీ మండల నాయకులు పరుశురామ్, డీహెచ్‌పీఎస్ నాయకులు ఓంకార్ స్వామి, రైతులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని పారదోలుదాం

పెద్దకడబూరు : క్షయ వ్యాధిని పారద్రోలుదామని డాక్టర్ ఫిర్దోస్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని హెల్త్ వెల్నెస్ సెంటర్లో ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సోమవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగాకు, ఆల్కహాల్ అలవాటు ఉన్నవారికి గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఆదినారాయణ, పీహెచ్ఎన్ సుశీలమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు కిషోర్, లక్ష్మినరసమ్మ, భాస్కర్ పాల్గొన్నారు.

చెక్ డ్యామ్‌లకు రక్షణ కల్పించాలి

గోనెగండ్ల: మండలంలోని గంజిహళ్లి మల్లెల వాగు వంకపై నిర్మించిన చెక్ డ్యామ్‌లకు రక్షణ కల్పించాలని ఆ గ్రామానికి చెందిన ముగి నాగేంద్రప్ప సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ మల్లెల వంక వాగులో వర్షపు నీరు వృథాగా పోకుండా పరిసర ప్రాంత పంట పొలాలో బోర్లు, బావులలో భూగర్భ జలాలు పెరగడం కోసం ప్రభుత్వం 2015లో మూడు చెక్ డ్యామ్‌లను నిర్మించిందన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కొంత మంది స్వార్థపరులు అధికార పార్టీ నాయకుల అండతో చెక్‌డ్యామ్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం మూడు చెక్‌డ్యామ్‌లను పడగొట్టేందుకు యత్నించారని, రైతులు అడ్డుకోవడంతో వారు వెళ్లిపోయారని చెప్పారు.